క్లుప్తంగా

ఆంధ్రా షిర్డీలో గురుపౌర్ణమికి ఏర్పాట్లు

బిక్కవోలు: ఆంధ్రా షిర్డీగా పేరుగాంచిన బలభద్రపురం షిర్డీ సాయి ఆలయంలో గురుపూర్ణిమ పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయం వద్ద బాబాకు క్షీరాభిషేకం, హారతులు, భజనలు, ప్రత్యేక పూజలతో పాటు భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తారన్నారు.

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం



విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

పెదపూడి: విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని జి.మామిడాడ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.శ్రీనివాసు అభిప్రాయపడ్డారు. శనివారం పాఠశాలలో విద్యాకమిటీ చైర్మన్ నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు పంపిణీ చేశారు. దాతలు అందించే సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పీడీ తాడి వీర్రాఘవరెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం



సీతానగరం పీహెచ్‌సీలో వైద్యులను సత్కరిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

సీతానగరం: డాక్టర్స్ డైను పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీలో వైద్యులు ఏవీకే చైతన్య, యేసురాణిలను మండల ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పెదపాటి డాక్టర్ బాబు, సభ్యులు డాక్టర్ సత్యం రమేష్‌బాబు, కంకటాల రమేష్‌లు వారిని సన్మానించారు. కార్యక్రమంలో బి.రేవతిదేవి, ఎం.నాగేశ్వత, ఎస్.మాధవి, బేగం, సీహెచ్ శాంతి పాల్గొన్నారు

ఉచిత వైద్య శిబిరం



శిబిరంలో రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి

బిక్కవోలు: మండలంలోని పందలపాక సూరారెడ్డి నర్సింగ్ హోమ్ ఎమర్జన్సీ మల్టీస్పెషాలిటి హాస్పటల్‌లో శనివారం డాక్టర్స్ డే సందర్భంగా ఉచితం వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 90 మందికి వైద్య పరీక్షలు చేసి ఇద్దరికి శస్త్రచికిత్స అవసరమని గుర్తించినట్లు ఆసుపత్రి అధినేత డాక్టర్ మల్లిడి కృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.లీలాసెరిన్, పి.కీర్తి, ఎం.భార్గవి తదితరులు వైద్య సేవలందించారు.

ఆర్టీసీ సర్వీసు పునరుద్ధరణ

మధురపూడి: మధురపూడికి ఆర్టీసీ బస్సును శనివారం పునరుద్ధరించారు. దీంతో ప్రజలు, విద్యార్థులు, మహిళలు సంతోషం వ్యక్తం చేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజాకు స్థానికులు ఈ సమస్యను తెలియజేశారు. దీంతో ఆయన ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించేలా చేశారు.

నరసింహస్వామికి పూజలు



డీపీఓ సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని జిల్లా పంచాయతీ అధికారి జానా సత్యనారాయణ శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. స్థానిక నాయకులు ఆయన్ని సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కోరుకొండ పంచాయతీ అధికారిగా పనిచేసిన తనకు ఇక్కడి ప్రజలతో విడదీయరాని సంబంధం ఉందన్నారు. కోరుకొండ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, ఉప సర్పంచ్ నేతుల చిన్ని, మాజీ సర్పంచ్ వాకా నరసింహారావు, నాయకుడు బొరుసు బద్రీ పాల్గొన్నారు.

మద్యం సీసాల స్వాధీనం

సీతానగరం: మండలంలో రామచంద్రపురం వద్ద మద్యం సీసాలతో కటికుల శ్రీనును అరెస్ట్ చేసినట్లు ఎస్సై కె.చిరంజీవి తెలిపారు. తన సిబ్బందితో ఎస్సై పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురం ఏటిగట్టుపై వాహన తనిఖీలు చేస్తుండగా పురుషోత్తపట్నంకు చెందిన శ్రీను తన స్కూటీ వెళ్తుండగా తనిఖీ చేశారు. అతని నుంచి 57 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

రైతు భరోసా కేంద్రాలు.. గేమ్ చేంజర్లు

- గ్రామాల్లో విశేష సేవలందిస్తున్న ఆర్బీకేలు
- ఎరువులు, విత్తనాలు, పనిముట్లు లభ్యం



సింగంపల్లి రైతు భరోసా కేంద్రం

రంగంపేట: ఒకప్పుడు రైతులకు ప్రభుత్వం నుంచి విత్తనాలు, ఎరువులు కావాలంటే మండల కేంద్రాల్లో కిలోమీటర్ల కొద్ది క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చేది. అంతేనా ఏటా ముష్టియుద్ధాలు సైతం తప్పేవి కాదు. ఇప్పుడు సొంతూరిలోనే రైతు భరోసా కేంద్రానికి వెళితే చాలు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ పనిముట్లు ఏవైనా సరే అన్నదాతలకు క్షణాల్లో లభిస్తున్నాయి. అందుకే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ముందు చూపుతో తీసుకొచ్చిన రైతు భరోసా కేంద్రాలపై అన్నదాతల నుంచి హర్షం వ్యక్తమవుతుంది. విత్తనం నుంచి పంట కొనుగోలు దాకా రైతన్నకు చేదోడువాదోడుగా నిలుస్తున్న ఆర్బీకేలు వ్యవసాయరంగంలో గేమ్ చేంజర్స్‌గా మారిపోయాయంటే అతిశయోక్తి కాదు.

ఎన్నో ప్రయోజనాలు

రైతు భరోసా కేంద్రాల ద్వారా మారుమూల గ్రామాల్లోని రైతులకూ సమస్త సమాచారం, ప్రభుత్వ సహకారం అందుతున్నాయి. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, పురుగుమందులతో పాటు సాగులో ఆధునిక పరిజ్ఞానం, మెళకువలు తెలియజేస్తున్నారు. ఆర్బీకేల్లోని కియోస్కల ద్వారా రైతులే స్వయంగా డిజిటల్ లావాదేవీలు చేస్తున్నారు. రైతులకు అవసరమైన అన్ని రకాల సేవలు ఈ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మండల కేంద్రాలకు కూడా వెళ్లే పరిస్థితి లేకుండా ఎవరి గ్రామంలో వారు వ్యవసాయ రంగ సేవలను పొందే అవకాశం కలిగింది. ప్రతి ఆర్బీకే సెంటర్‌లో రైతు సహాయకులను నియమించి సాగులో సలహాలు, సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఆఖరికి రైతు పండించిన ధాన్యాన్ని సైతం ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేస్తుండడంతో దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట పడింది.

శరవేగంగా ఆర్బీకేల నిర్మాణం

రంగంపేట మండలంలో ఆర్బీకేలు	19
ఇప్పటికే పూర్తయినవి	8
నిర్మాణంలో ఉన్నవి	9
స్థల సేకరణ చేయాల్సినవి	2
ఒక్కో ఆర్బీకే భవనానికి మంజూరైన సొమ్ము	రూ.21.80 లక్షలు

రైతు భరోసా కేంద్రాల నిర్వహణకు శాశ్వత భవనాలు ఉండాలని ప్రభుత్వం నిర్ణయించింది. రంగంపేట మండలంలో 19 ఆర్బీకే భవనాలను నిర్మించాల్సి ఉండగా ఒక్కో భవనానికి రూ.21.80 లక్షలు చొప్పున నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణాలకు టెండర్ల ప్రక్రియ సత్వరమే పూర్తి చేయడంతో నిర్మాణాలు వేగంగా పూర్తవుతున్నాయి. రంగంపేట మండలం సింగంపల్లి గ్రామంలో ఆర్బీకే భవనం పూర్తి కావడంతో రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. సుభద్రంపేటలో ఆర్బీకే భవనం పూర్తయి ప్రారంభానికి సిద్ధగా ఉంది. మరో ఆరు గ్రామాల్లో ఆర్బీకే భవన నిర్మాణాలు పూర్తయి టైల్స్ పనులు జరుగుతున్నాయి. మరో 9 భవన నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా, జి.దొంతమూరు, బాలవరం గ్రామాల్లో ఆర్బీకే భవనాల నిర్మాణానికి స్థల సేకరణ జరగాల్సి ఉంది.

ఆర్బీకేలు రైతులకు వరం



గత ప్రభుత్వ హయాంలో రైతులను పట్టించుకున్న నాథుడే లేడు. సలహాల కోసం సైతం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వచ్చేది. నేడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆర్బీకే సెంటర్లు పుణ్యమా అని రైతుల వద్దకే రైతు సేవలొచ్చాయి. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అనడంలో సందేహం లేదు.

– రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి, మర్రిపూడి

త్వరలో అందుబాటులోకి భవనాలు



రంగంపేట మండలంలో ఆర్బీకే భవన నిర్మాణాల విషయంలో నాణ్యత ప్రమాణాలకు అధిక ప్రాధాన్యతనిస్తున్నాం. ప్రభుత్వం ఆర్బీకే భవన నిర్మాణాల విషయంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తుంది. అసంపూర్తిగా ఉన్న భవనాలను త్వరితగతిన పూర్తి చేస్తాం. రైతులకు భవన నిర్మాణాలను త్వరలోనే అందుబాటులోకి తెస్తాం.

– చవ్వా రాము, ఏఈ, పంచాయతీరాజ్, రంగంపేట

ఎంతో ఉపయోగం



రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడంతో పాటు రైతులకు సూచనలు, సలహాలు అందిస్తున్నారు. పంట రుణాలు, బీమా, గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఆర్బీకే సిబ్బంది రైతులకు సహాయపడుతున్నారు.

– గూడుపు గోవిందు, రైతు, ఈలకొలను

డెంగీపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు డెంగీపై అవగాహన కల్పిస్తున్న ఎంపీహెచ్ఈఓ రాయుడు

గోకవరం: విద్యార్థులు డెంగీ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని సీహెచ్ఓ మేరీకృప, ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు సూచించారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా శనివారం గోకవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్లు పవన్, రమణ, శ్రీను పాల్గొన్నారు.

అడ్డంకులు సరికాదు

రాజానగరం: నరేంద్రపురంలో దళితులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన అసైన్డ్ భూములలో సాగు చేయనీయకుండా అగ్రవర్ణాల వారు అడ్డంకులు కల్పిస్తున్నారని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. ఆ భూములలో కొందరు చేపట్టిన కాలువ తవ్వకాన్ని శనివారం వారు పరిశీలించారు. 1977లో ఈ భూములను ప్రభుత్వం దళితులకు ఇచ్చిందని, అప్పటి నుంచి సాగు చేసుకుంటుంటే ట్రాక్టర్లు అడ్డుపెట్టడం, శ్మశానం అంటూ సాగు చేసిన పంటను పశువులచే నాశనం చేయించడం వంటి దుశ్చర్యలకు తరచూ పాల్పడుతున్నారన్నారు. ఇప్పుడు ఏకంగా కాలువనే తవ్వేశారన్నారు. దీనిపై అధికారులు స్పందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా నాయకుడు ఇసుకపట్ల రాంబాబు, రిపబ్లికన్ ట్రేడ్ యూనియన్ జిల్లా నాయకుడు కోనాల లాజరు, అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు పి.వెంకట్‌నాయుడు, జె.సత్తిబాబు పాల్గొన్నారు.

జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- రామేశ్వరంలో గడప గడపకూ..



రామేశ్వరం గడప గడపకూ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: దేశంలోనే ఆదర్శవంతమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని రామేశ్వరంలో శనివారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ప్రజలు పెద్ద ఎత్తున మంగళహారతులిచ్చారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రజల గుండె చప్పుడు ముఖ్యమంత్రి జగన్ అని కొనియాడారు. దేశంలోనే ఇప్పటివరకూ ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా అమ్మ ఒడి, ఇంగ్లిష్ మీడియం విద్య, నాడు–నేడు పథకంలో పాఠశాలలు, ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధి, రైతుభరోసా తదితర చారిత్రాత్మక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో జనరంజక పాలన సాగుతుందన్నారు. ఏ గడపకూ వెళ్లినా ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, గ్రామ సర్పంచ్ కొటికలపూడి చినబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, కొటికలపూడి గోపి, ఆలయ కమిటీ చైర్మన్ గంగుమళ్ల సుబ్రహ్మణ్యం, గ్రామ కన్వీనర్ గాజుల మణికంఠ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బసవ విజయకుమారి, ఉప సర్పంచ్ కొటికలపూడి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోండి



'నన్నయ' వర్సిటీలో మొదటి బ్యాచ్‌కు శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాజానగరం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన ఫలితాలను సాధించాలనే ఉద్దేశంతో ఇస్తున్న శిక్షణను ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని కోర్సు డైరెక్టర్, కడియం ఎంఈఓ వి.లజపతిరాయ్ అన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్)పై రెండు రోజుల పాటు జరిగే శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. తరగతి గదులలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి బోధించడం, ఐఎఫ్‌పీ, బైజూస్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లాలో 3 నుంచి 10వ తరగతి వరకూ బోధించే ఉపాధ్యాయులకు «నన్నయ» వర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, ఆదిత్య ఇంజినీరింగ్ (సూరంపాలెం), జీవీసీ (పాలచర్ల), గైట్ (రాజమండ్రి), ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ (రాజానగరం), వెస్ట్ గోదావరి ఇంజినీరింగ్ (కొవ్వూరు), గైట్ కళాశాలలో 7 బ్యాచ్‌లుగా ఈ నెల 15 వరకూ శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. జిల్లాలోని ప్రతి ప్రభుత్వ పాఠశాల నుంచి 50 శాతం ఉపాధ్యాయులు ఒక బ్యాచ్‌లో, మిగిలిన వారు మరో బ్యాచ్‌లో శిక్షణ పొందాల్సి ఉంటుందని కోర్సు డైరెక్టర్ వివరించారు. బ్యాచ్‌కు రెండు రోజుల పాటు ఇచ్చే ఈ శిక్షణకు రిసోర్స్‌పర్సన్లుగా డాక్టర్ డి.శ్రీనివాసరావు, ఎం.రామకృష్ణ, ఎ.విజయదుర్గ, డి.కిశోర్ వ్యవహరిస్తున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



కామరాజుపేటలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

గోకవరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ నాయకుడు సుంకర వీరబాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్ అన్నారు. మండలంలోని కామరాజుపేటలో సీసీ రోడ్డు, శ్మశానవాటికలో మంచి నీటి ట్యాంకు నిర్మాణానికి శనివారం వారు శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఇటీవల ఆయా సమస్యలను ఎంపీపీ సుంకర శ్రీవల్లి దృష్టికి తీసుకువెళ్లగా రూ.10 లక్షలతో సీసీ రోడ్డు, రూ.2 లక్షలతో మంచినీటి ట్యాంకు నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన ఆదేశాల మేరకు మండల పరిషత్ నిధులు కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ అడపా వెంకట్రావు, ఎంపీటీసీ మజ్జూరి అప్పారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సింబోతుల అచ్చిరాజు, గోపాల బాబులు, తోలేటి రాంప్రసాద్, కాకి ప్రసాద్, మజ్జూరి రామకృష్ణ, రాజమండ్రపు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో చందన నాగేశ్వర్, పార్టీ నాయకులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు నేతాజీనగర్‌లో శనివారం రాత్రి వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ సమక్షంలో టీడీపీ, జనసేన నుంచి భారీగా వైఎస్సార్ సీపీలో చేరారు. గ్రామ సచివాలయం-4 కన్వీనర్ కేవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బృందావన్ కాలనీ, నేతాజీనగర్ వాసులకు చందన నాగేశ్వర్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో పాటు, చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరామని వారు పేర్కొన్నారు. పార్టీలో చేరిన ప్రతిఒక్కరూ 2024లో సీఎం జగన్ తిరిగి ముఖ్యమంత్రి అయ్యేందుకు కృషి చేయాలని చందన పిలుపునిచ్చారు. బృందావన్ కాలనీ నుంచి మానస, గీత, రాణి, మమత, శేషమ్మ, సుబ్బలక్ష్మి పార్టీలో చేరారు. వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు ముద్దాల అను, జేసీఎస్ కన్వీనర్లు విష్ణుమూర్తి, రాజమౌళి, నాయకులు యెనుముల త్యాగరాజు, సద్గుణ రామారెడ్డి, రాజేష్ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు

ఆర్డీఓ చైత్ర వర్షిణి



కూనవరం గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ చైత్ర వర్షిణి

సీతానగరం: ప్రభుత్వం ప్రజల ముంగిటకే సేవలను తీసుకువచ్చిందని, ఇందులో భాగంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాజమహేంద్రవరం ఆర్డీఓ చైత్ర వర్షిణి తెలిపారు. శనివారం కూనవరంలో ఎంపీడీఓ కె.రమేష్, పురుషోత్తపట్నంలో తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న సురక్ష గ్రామ సభలలో ఆర్డీఓ చైత్ర వర్షిణి, మండల స్పెషల్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ప్రజల చెంతకే సేవలను అందించాలనే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని తీసుకొచ్చారన్నారు. ఇందులో భాగంగా వారం రోజుల ముందుగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులు ప్రతి ఇంటికి వెళ్లి వారికి కావాల్సిన పదకొండు రకాల సర్టిఫికెట్ల గురించి యాప్‌లో నమోదు చేశారన్నారు. సర్టిఫికెట్లు అందుకున్న వారితో డిస్‌ప్లేలో ఉన్న నంబరుకు థ్యాంక్యూ జగనన్న అని మెస్సెజ్ పెట్టాలని అన్నారు. పురుషోత్తపట్నం గ్రామసభలో 555 కుల ధ్రువీకరణ పత్రాలు, 473 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 18 రేషన్ కార్డులు, 3 హెల్త్ కార్డులు అందించారు. కూనవరంలో 417 కుల ధ్రువీకరణ పత్రాలు, 426 ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3 మ్యారేజ్ సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, జెడ్పీటీసీ చల్లమళ్ల వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ-2 సత్యం మదన్‌బాబు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, కోకన్వీనర్ కరటూరి శ్రీహరిబాబు, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు పెదపాటి డాక్టర్ బాబు, సర్పంచులు సుంకర గంగాలక్ష్మి, సరిపల్లి అనురాధ తదితరులు పాల్గొన్నారు

ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ



మల్లవరంలో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గోకవరం: ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకే ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. మండలంలోని మల్లవరంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందన్నారు. లబ్ధిదారులకు అవసరమైన జనన, మరణ, నివాస, భూమి హక్కు పత్రాలు తదితర అన్ని రకాల సర్టిఫికెట్లను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం 2013 మంది లబ్ధిదారులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ, జగ్గంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ జనపరెడ్డి బాబు, సచివాలయ మండల కన్వీనర్ దాసరి రమేష్, సీనియర్ నాయకుడు సుంకర వీరబాబు, ఎస్సీసెల్ జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, టౌన్ కన్వీనర్ చింతల అనిల్‌కుమార్, గోకాడ చిట్టిబాబు, పైల కల్యాణ్, అల్లం వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేసిన వారికి సుస్థిర స్థానం

రంగంపేట: అంకితభావంతో పనిచేసిన ఉపాధ్యాయులు విద్యార్థుల మనసులో సుస్థిర స్థానం సంపాదిస్తారని ఉన్నత పాఠశాల పూర్వపు ప్రధానోపాధ్యాయుడు ఏవీఎస్ ఫణికుమార్ అన్నారు. స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేసిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు ఈమని వెంకటబుచ్చి రామలక్ష్మి సత్కార సభ చంద్రేడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గంటా రమణబాబు అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో పలువురు రామలక్ష్మి సేవలను కొనియాడారు. అనంతరం గ్రామ సర్పంచ్ జాస్తి వెంకట పద్మావతి, ఎంపీటీసీ కంటిపూడి శేషారత్నం, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు రామలక్ష్మికి పూలమాలలు వేసి సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు జి.అరుణ, మీనాక్షి, మధులత, కాంతరత్నం, విజయలక్ష్మి, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు జాస్తి సత్తిబాబు, కంటిపూడి గంగరాజు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడి చోరీ

కడియం: కడియపులంక పంచాయతీ పరిధి దోసాలమ్మ కాలనీలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... దోసాలమ్మ కాలనీకి చెందిన బి.చంద్రావతి తన ఇంట్లోని బెడ్‌రూమ్ లో, భర్త ఏసురాజు, కుమారుడు హాల్‌లో నిద్రించారు. ఇంటి తలుపులకు తాళం వెయ్యలేదు. తెల్లవారు జామున 2.30 గంటల ప్రాంతంలో ఏసురాజు కాలిని ఎవరో తన్నుకుంటూ బయటకు వెళుతున్నట్లు అనిపించింది. మెలకువ వచ్చి చూడగా గుర్తు తెలియని వ్యక్తి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అతడిని వెంబడిస్తూ వెళ్లినప్పటికీ అగంతకుడి ఆచూకీ దొరకలేదు. ఇంట్లోకి వచ్చి పరిశీలించగా బీరువాలోని 10 గ్రాముల బంగారు నెక్లెస్ మాయమైనట్లు గుర్తించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కడియం హెడ్ కానిస్టేబుల్ సీహెచ్‌వీ రమణ కేసు నమోదు చేశారు.

యోగా శిక్షణ తరగతులు

సీటీఆర్ఐ: స్థానిక కోటిలింగాలపేట శ్రీపందిరి మహాదేవుడు సత్రంలోని కృష్ణ యజుర్వేద స్మార్త పాఠశాలలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని సత్రం సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వీవీ పక్షంరాజు తెలిపారు. 40 మంది స్మార్త విద్యార్థులకు యోగా గురువు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ తరగతులు జరుగుతున్నాయన్నారు. ప్రతి విద్యార్థి బాల్య దశ నుంచి యోగాలో శిక్షణ పొంది మానసిక, శారీరక ఆరోగ్యాన్ని పెంచుకోవాలని అన్నారు. ఈ శిక్షణ ఆరేళ్ల స్మార్త కోర్సు పూర్తయ్యే వరకూ ఉంటుందన్నారు. యోగా గురువు పతంజలి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇప్పటి వరకూ 350 యోగా శిబిరాలు నిర్వహించామన్నారు. సనాతన ధర్మానికి వారిధిగా నిలిచిన ఈ స్మార్త పాఠశాలలో శిక్షణ ఇవ్వడం ఓ అపూర్వ ఘట్టమన్నారు.

సుపరిపాలనే లక్ష్యంగా సురక్ష



జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాల ప్రయోజనం చేకూర్చేందుకు ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక గ్రామ సచివాలయం-1లో జగనన్న సురక్ష పథకాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శమన్నారు. ప్రభుత్వ సొమ్ము తినాలంటే ఎంతో రుణం ఉండాలనే నానుడి గతంలో ఉండేదని, అయితే ప్రస్తుతం ప్రభుత్వ సొమ్ము తినాలంటే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి ఉండాలనే పరిస్థితిని వైఎస్సార్‌సీపీ కల్పించిందన్నారు. అనంతరం లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా ధ్రువపత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ సత్తి గీతావరలక్ష్మి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వైస్ ఎంపీపీలు పులగం బుల్లిరెడ్డి, కర్రి దాసు, తహసీల్దార్ సరస్వతి, పార్టీ రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ సత్తి రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి చిర్ల వీర్రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నం పరబ్రహ్మ స్వరూపం



అన్నవితరణలో చిన్నవెంకన్నబాబు స్వామీజీ

సీటీఆర్ఐ: గాడాలలోని శ్రీమహాలక్ష్మీ సమేత చిన్న వేంకటేశ్వరస్వామివారి పీఠాధిపతి, గురుగోవింద శ్రీమాన్ చిన్న వెంకన్నబాబు స్వామీజీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని శనివారం నగరంలో నిరాశ్రయులకు అన్నవితరణ చేశారు. సుమారు వెయ్యి మందికి స్వామీజీ శిష్య బృందం అన్నవితరణ చేసింది. శ్రీమాన్ చిన్నవెంకన్న బాబు మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపమన్నారు. ట్రస్టు జాతీయ చైర్మన్ దుర్గా వెంకటహేమవతి మాట్లాడుతూ మనగుడి–మనసేవ జాతీయ ఆధ్యాత్మిక సేవా సమితి, సర్వేజనా సుఖినోభవంతు చారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో సేవ చేశామన్నారు. ట్రస్టు ఉభయ తెలుగు రాష్ట్రాల చైర్మన్ మతల రమేష్ పుట్టినరోజు కూడా కావడంతో వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. శనివరపు ధనరాజ్, సూరిశెట్టి వీరవెంకట సత్యనారాయణమూర్తి, పచ్చిపులుసుల వీరభద్రరావు, ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ అంబటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిక్షణ నిరంతర ప్రక్రియ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సహకార వ్యవస్థలో శిక్షణ నిరంతర ప్రక్రియ అని జిల్లా సహకార అధికారి ఉమామహేశ్వరరావు అన్నారు. స్థానిక గాంధీపురంలోని రామదాసు సహకార శిక్షణ కేంద్రంలో శనివారం అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా సహకార హైట్ అధికారి జగన్నాథరెడ్డి, డీఎస్‌పీవో ఉమాపార్వతి, శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.